క్లుప్తంగా

ఉన్నత చదువుల్లో రాణించాలి

శ్రీకాళహస్తి : ప్రతిభావంతుల దినోత్సవాన్ని పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో భువనేశ్వరి మాట్లాడుతూ.. ప్రతిభావంతులను తీర్చిదిద్ది ఉన్నత చదువుల్లో రాణించే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె నిర్మాణం

సత్యవేడు : తుపాను వర్షాలకు మల్లవారిపాళెం ఈస్టు పంచాయతీలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను సర్పంచ్ పార్వతి చొరవతో నూతనంగా నిర్మించారు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూలిపోవడంతో విద్యుత్ సరఫరా లేక రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటి సరఫరా యథావిధిగా నిర్వహించేందుకు దిమ్మె పై త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. దీంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగిపోయాయి. త్వరితగతిన చర్యలు చేపట్టిన సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దివాకర్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బంది బుచ్చినాయుడుకండ్రిగలోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ శరీరంలో ప్రవేశించాక జ్వరం, నోటిపూత, చర్మవ్యాధులు, నీరసం, నీళ్ల విరేచనాలు, ఆకలి తగ్గిపోవుట, అలసట, 10 శాతం బరువును కోల్పోవడం తదితర లక్షణాలు కనబడుతాయని తెలిపారు. ఈ వ్యాధి వలన రోగ నిరోధక శక్తిని నశిస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ల్యాబ్‌ల ఏర్పాటు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

శ్రీకాళహస్తి : స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల, సరస్వతీబాయి పురపాలక సంఘం ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎక్స్ స్టెమ్ ల్యాబ్‌లను ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య ప్రారంభించారు. రెండేళ్ల నుంచి షెల్ ఇండియా సహకారంతో స్మైల్ ఫౌండేషన్ వారు తిరుపతి జిల్లాలోని 38 పాఠశాలల్లో ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన ప్రాపంచిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నా మన్నారు. ఒక్కొక్క పాఠశాలకు రూ.2 లక్షలు విలువైన ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, బృందాదేవి, జయసుధ, స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధి విజయసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర పంటలతో ఆదాయం

నారాయణవనం : ప్రధాన పంటలతో పాటు అంతర పంటలను సాగు చేయడంతో అధిక లాభాలను పొందవచ్చునని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీ లక్ష్మీదేవి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అరణ్యంకండ్రిగ రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ.. ఆరు తడి పంటలలో చీడలు, తెగుళ్ల వ్యాప్తి చెందకుండా అంతర పంటలుగా రాగి, జొన్న, ఆముదం సాగు చేయాలని సూచించారు. తుపాను ప్రభావంతో మండలంలో పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదించి, పరిహారాన్ని అందజేయాలని రైతులు ఈ సందర్భంగా అధికారులను కోరారు. వనరుల కేంద్రం ఏవో శశిధరరెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ మోహన్‌రాజు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


ధ్వంసమైన కారు, అనూప్ (ఫైల్)

రేణిగుంట (ఏర్పేడు): ఏర్పేడు -వెంకటగిరి మార్గంలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు.వివరాలు.. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలుకు చెందిన చెందిన సుబ్బరామి రెడ్డి(65) బైక్‌పై వెళుతుండగా ఏర్పేడు మండలంలోని పల్లం వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ జయచంద్ర తెలిపారు.

భార్యను ఆస్పత్రిలో చేర్చి వస్తూ..

తెలంగాణలోని ఖమ్మం జిల్లా పెద్దిరెడ్డి గూడేనికి చెందిన అనూప్(32)కు ఏడాది కిందట శ్రీకాళహస్తి మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన ప్రణితితో వివాహమైంది. కాన్పు కోసం పుట్టింటికి వచ్చిన భార్యను అనూప్ సోమవారం తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చేర్పాడు. కారులో తిరిగి బ్రాహ్మణపల్లెకు వస్తుండగా చింతలపాళెం టోల్‌ప్లాజా వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో అనూప్ ఘటనాస్థలంలోనే మృత్యువాత పడ్డాడు.

మద్యం విక్రేతపై కేసు

రేణిగుంట(ఏర్పేడు): మండలంలోని కొత్త వీరాపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏర్పేడులోని ఓ వైన్‌షాప్ నుంచి మద్యం సీసాలను కొనుగోలు చేసి గ్రామంలో అధిక ధరకు విక్రయిస్తూ గాండ్ల రవి(62) అనే వ్యక్తి పట్టుబడినట్టు పోలీసులు వెల్లడించారు. రవి నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, స్కూటర్‌ను సీజ్ చేసినట్లు వివరించారు.

రహదారుణాలు

రహదారులపై అడుగడుగునా గుంతలు.. పగలు వెళ్లాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో తుపాన్ ప్రభావంతో రహదారులు మరింత దారుణంగా తయారయ్యాయి. వాటిపై ఏ మాత్రం అజాగ్రత్తగా ప్రయాణించినా.. నడుములు విరిగి ఆస్పత్రికే అన్నట్లు తయారయ్యాయి. ఎక్కడ గుంత ఉందో లేదో తెలియని అయోమయ పరిస్థితి.. సత్యవేడు నియోజకవర్గంలో రోడ్లు దారుణంగా మారాయి.ఛిద్రమైన రోడ్లలో వాహనదారులు ప్రయాణిస్తూ నరకం చూస్తున్నారు.

- వర్షంతో ఛిద్రమైన రహదారులు
- కుంటలను తలపిస్తున్న సత్యవేడు రోడ్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


శ్రీకాళహస్తి-తడ ప్రధాన రోడ్డులోని పదో మైలు వద్ద ఛిద్రమైన రోడ్డు

వరదయ్యపాళెం : నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. ఇంత దారుణంగా ఉన్నా రహదారుల అభివృద్ధి గురించి కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదు. అంతేకాక నియోజకవర్గ ప్రజాప్రతినిధులు సైతం ఆ రోడ్ల గురించి పట్టించుకోకపోవడం ప్రజలకు విస్మయాన్ని కలిగిస్తోంది. సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో ప్రధాన రోడ్లతో పాటు పలు కాజ్‌వేలు, కల్వర్టులు వర్షాలకు కొట్టుకుపోయాయి.

ఆర్అండ్‌బీ రోడ్ల దుస్థితి

శ్రీకాళహస్తి-తడ, సత్యవేడు-తడ, ఊత్తుకోట-సత్యవేడు ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ రహదారుల్లో ప్రయాణం వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. శ్రీకాళహస్తి- తడ మార్గంలో ప్రధానంగా తంగేళ్లపాళెం, విజయగోపాలపురం, కుమార వెంకటాపురం, ఎన్టీఆర్ నగర్, వరత్తూరు, గోవర్ధనపురం, బత్తవల్లం, రాచకండ్రిగ ప్రాంతాల్లో గుంతలు ఏర్పడి రాకపోకలకు వాహనదారులు నరకయాతన పడుతున్నారు. అలాగే తడ-సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గంలో వెంకటరెడ్డికండ్రిగ, సుబ్బరాజుకండ్రిగ, కంచరపాళెం, యానాదివెట్టు, రాళ్లకుప్పం, అమాసరెడ్డికండ్రిగ, నీలితొట్టికండ్రిగ ప్రాంతాల్లో రోడ్లు ఛిద్రమై రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఊత్తుకోట-సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గంలో 16కి.మీల మేరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమై వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. ఈ మూడు ప్రధాన రోడ్డు మార్గాల గుండా రోజువారీ శ్రీసిటీలోని వందల పరిశ్రమలకు వేల మంది ఉద్యోగులు బస్సులు, మినీ వ్యాన్లు, ద్విచక్ర వాహనాలల్లో వెళ్తుంటారు. ప్రస్తుతం ఉన్న రోడ్ల పరిస్థితి ఇబ్బందికరంగా ఉండడంతో నిత్యం ప్రమాదాలకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొట్టుకుపోయిన ద్వారకనగర్ కాజ్‌వే

నాగలాపురం మండలంలో సుమారు 10 గ్రామాలకు వెళ్లేందుకు అనుసంధానంగా ద్వారకనగర్ వద్ద ఏర్పాటు చేసిన కాజ్‌వే తుపాన్ కారణంగా కొట్టుకుపోయింది. దీని కారణంగా నారాయణరాజుకండ్రిగ, లబ్బికండ్రిగ, గోవర్ధనగిరి, అడవికొడింబేడు, ఓబులరాజుకండ్రిగ తదితర గ్రామాల ప్రజలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కనిపించని ఆరికిచేలు కల్వర్టు

వరదయ్యపాళెం మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీలో ఉన్న ఆరికిచేలు గ్రామస్తుల రాకపోకలకు వెళ్లే మార్గంలో కల్వర్టు వర్షాల కారణంగా కొట్టుకుపోయింది.

గోవర్ధనపురం వంతెన గోడు పట్టదా?

కొద్దిరోజులుగా వరదయ్యపాళెంలోని గోవర్ధనపురం వద్ద మారేడు కాలువపై ఉన్న లోలెవల్ కాజ్‌వే మరమ్మతులకు గురైంది. భారీ వర్షాలకు కాజ్‌వే శ్లాబ్ పూర్తిగా ధ్వంసమైంది. దీంతో నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతున్నా ప్రభుత్వ యంత్రాంగానికి ఏమాత్రం పట్టడం లేదు. 3 రోజుల కిందట భారీ వర్షం కారణంగా ఆర్టీసీ బస్సు గోవర్ధనపురం కాజ్‌వేపై ఏర్పడిన గుంతల్లో ఇరుక్కుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ధ్వంసమైన పూడి సీకేపురం కాజ్‌వే :

కేవీబీపురం మండలంలోని పూడి సీకేపురం కాజ్‌వే 4 రోజుల కిందట భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాంతంలోని 5 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే వరత్తూరు రోడ్డు మార్గం పూర్తిగా దెబ్బతింది.

అధికారులు స్పందించాలి

అధ్వానంగా ఉన్న నియోజకవర్గ రోడ్ల అభివృద్ధి గురించి ప్రభుత్వ అధికారులు స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రధాన రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే అనుసంధాన రోడ్లు అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇప్పటికే రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న పరిస్థితుల్లో రహదారుల అభివృద్ధి కీలకం. దీనిపై ప్రజాప్రతినిధులు, ఆర్అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


నాగలాపురం మండలంలో కొట్టుకుపోయిన ద్వారకనగర్ కాజ్‌వే




ఆరికిచేలు వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు, సంతవేలూరు మార్గంలో కోతకు గురైన రోడ్డు, సత్యవేడు-తడ రోడ్డు మార్గంలో యానాదివెట్టు వద్ద రోడ్డు దుస్థితి

ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రవి

సత్యవేడు : ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ అందించేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలను ఎంఈఓ రవి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ గదిలో మెగా పేరెంట్ మీటింగ్ నిర్వహణపై ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీన ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. సమావేశానికి ఎక్కువ మంది తల్లిదండ్రులు హాజరయ్యేటట్లు చూడాలన్నారు. ప్రతి రోజు టాయిలెట్‌లు పరిశీలించి ఫొటోలు పెట్టాలని కోరారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఉషా, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన


పల్లం సచివాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

రేణిగుంట(ఏర్పేడు) : ఒకేషనల్ ట్రైనింగ్ పార్ట్నర్ - ప్రిజం ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా ఏర్పేడు మండలం పల్లం ఉన్నత పాఠశాలలోని 9 ,10 తరగతి విద్యార్థులు సచివాలయ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆధార్ అప్డేట్, డేటా ఎంట్రీ , అధికారుల విధి నిర్వహణ, తదితర సాంకేతిక అంశాల గురించి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు ఆనంద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఒకేషనల్ ట్రైనర్ సుధారాణి విద్యార్థులకు ఈ అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు వాణి, కె.వి బాబు, మెహర్ బాబా, సురేష్, శ్రీరాములు, రామచంద్రయ్య పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికకు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ ప్రభాకర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈ రత్నాకర్‌రెడ్డి

సత్యవేడు : సాగునీటి సంఘాల ఎన్నికకు రైతులు సహకరించాలని ఏఈ ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈనెల 8న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయంలో సాగునీటి ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ ఉద్యోగులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. మండలంలో 13 చిన్ననీటి పారుదల సంఘాలు ఉన్నాయని తెలిపారు. మదనంబేడు, శిరుణంబూదూరు పెద్ద చెరువు, శిరుణంబూదూరు చిన్న చెరువు, పేరడం, పీవీ.పురం, రాజగోపాలపురం, పుదుకుప్పం, వీఆర్ కండ్రిగ, ఆంబాకం, దళవాయి అగ్రహారం, మదనంజేరి, కన్నావరంలలో నీటి సంఘాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని 13 చెరువుల పరిధిలో 2,095 మంది రైతులు ఓటర్లుగా ఉండగా వాటిలో పురుషులు 1,577, స్త్రీలు 518 మంది ఉన్నారు. ఈ సంఘాల్లో కమిటీ సభ్యులను ఎన్నుకునేందుకు రైతులు ఓటు వేస్తారన్నారు. ఎన్నికల అధికారులుగా అయిదుగురిని నియమించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ ఇబ్రహీం ఖాన్, తెలుగు గంగ ఏఈ వెంకటరమణ, రాజగోపాల్, వెంకటేశం, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు,

ఎన్నిక పకడ్బందీగా నిర్వహించాలి

బుచ్చినాయుడుకండ్రిగ : సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని డీఈ రత్నాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎన్నికలకు సంబంధించి 5వ తేదీన నోటిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. 8వ తేదీన నీటి సంఘాల సభ్యులకు ఎన్నికలు ఉంటాయన్నారు. మండలంలో 13 సాగునీటి సంఘాల ఎన్నికల కోసం 91 మంది సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. ఒక్కో చెరువుకు ఆరుగురిని మెంబర్లుగా ఎన్నుకుని, వారిలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకోవటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఏఈలు కలాంబాషా, పాల్గొన్నారు.


దివ్యాంగుల్లో ప్రతిభను గుర్తించండి


బహుమతి ప్రదానం చేస్తున్న ప్రభాకర్‌రాజు

నారాయణవనం : దివ్యాంగ పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలని ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో, నారాయణవనం ఎంఈవో ప్రభాకర్‌రాజు పేర్కొన్నారు. ప్రతిభావంతుల దినోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ.. అంగవైకల్యాన్ని లోపంగా చూడటాన్ని మానేయాలని కోరారు. దివ్యాంగ పిల్లల కోసం భవిత కేంద్రాన్ని నడుపుతున్నట్లు తెలిపారు. ప్రతి రోజు తల్లిదండ్రులు తమ పిల్లలకు కేంద్రంలో శిక్షణ ఇప్పించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫిజియోథెరపీతో పాటు స్పీచ్ థెరఫీ, ఎంఆర్ థెరపీలను ఉచితంగా పిల్లలకు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగ పిల్లలకు బహుమతులను అందజేశారు. ఎంఈవో-2 జనార్దన్‌రాజు మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ చైర్మన్ గిరికి

ఆశావహుల సందడి


శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి ఆశించే వారి సంఖ్య అధికంగానే ఉందని చెప్పాలి. ఆలయ చైర్మన్‌గా అత్యధిక జనాభా గల వన్నె కుల క్షత్రియులకు అవకాశం ఇవ్వాలని వినిపిస్తోంది. ఆ కోటాలో టీడీపీ వీర విధేయుడుగా చెప్పుకునే రాష్ట్ర అధికార ప్రతినిధి, బాలకృష్ణ అభిమానిగా రెడ్డివారి గురవారెడ్డి గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ఏర్పేడు మండలాధ్యక్షుడుగా టీడీపీ సీనియర్ లీడర్‌గా కాపు సామాజిక వర్గానికి చెందిన పొన్నారావు సీఎం నారా చంద్రబాబును కలిసి తనకు చైర్మన్ పదవి ఇవ్వాలని కోరినట్లు సమాచారం. బొజ్జల సుధీర్‌రెడ్డి కుటుంబానికి విధేయుడుగా ఉంటూ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గత టీడీపీ ప్రభుత్వంలో ఉండి ఈ ఎన్నికల్లో సుధీర్‌రెడ్డి గెలుపులో కీలకపాత్ర పోషించిన చెంచయ్యనాయుడు వెలమ సామాజికవర్గం నుంచి పోటీపడుతున్నారు. ఆయన ఇప్పటికే సుధీర్‌రెడ్డి మద్దతుతో రెండు సార్లు చంద్రబాబును, ఒకసారి లోకేష్‌ను కలిసి చైర్మన్ పదవి కోసం అభ్యర్థించడం జరిగింది. ఇక బీసీ సామాజిక వర్గానికి చెందిన హ్యాండ్ క్రాఫ్ట్ స్టేట్ డైరెక్టర్‌గా వ్యవహరించిన దశరథాచారి బీసీ కోటాలో తనకే అవకాశం ఇవ్వాలని బీసీ నేతలతో కలిసి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. కూటమి నుంచి తమకు అవకాశం ఇవ్వాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత, బీజేపీ నుంచి ఎవరికైనా ఇవ్వాలని ఆ పార్టీ నేతలు కోరుతున్నారు. అయితే చైర్మన్ పదవి చెంచయ్యనాయుడుకు వచ్చేసినట్లుగా ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఆలయ చైర్మన్ గిరి ఎవరిని వరిస్తోందో వేచి చూడాల్సిందే.

రాచపాళెంలో కేన్సర్ స్క్రీనింగ్ వైద్యపరీక్షలు

సత్యవేడు : మండలంలోని రాచపాళెం, ఆరూరు పంచాయతీల్లో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాలు మంగళవారం నిర్వహించారు. మహిళలకు రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అంకాలజీ పీఆర్ఓ చంద్రశేఖర్, ఎంపీటీసీ సురేంద్ర, సర్పంచులు రూబెన్, గోవిందస్వామి, అలిమేలమ్మ, డాక్టర్లు చైతన్యభాను, హరిత వైద్య పరీక్షలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు హరీష్, జలజశ్రీ , పీహెచ్ఎస్ రాణి, ఎంఎల్‌హెచ్‌పీలు పవిత్ర, దీపిక, ఏఎన్ఎంలు , ఆశావర్కర్లు,అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావేదిక అర్జీలను పరిష్కరించాలి : ఆర్డీఓ


సురుటుపల్లి చెక్ పోస్టులో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి

నాగలాపురం : మండలంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని శ్రీకాళహస్తి డివిజన్ ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదికకు వస్తున్న అర్జీలను పరిశీలించారు. అర్జీలను స్వీకరించడమే కాకుండా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అనంతరం సుబ్బనాయుడు కండ్రిగ ఇసుక రీచ్‌ను పరిశీలించి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక వీఆర్వోను ఆదేశించారు. అక్కడ నుంచి బయలుదేరి సురుటుపల్లి వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టులో రికార్డులను పరిశీలించి ప్రతి వాహనాన్ని పరిశీలించాలని, తమిళనాడుకు అక్రమంగా ఇసుక రవాణా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ హనుమాన్ నాయక్, ఎంపీడీఓ బాలాజీనాయక్, వీఆర్వో నాగభూషణం, చంద్రశేఖర్, మహేష్, చంద్రశేఖర్. సుకుమార్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ..

సత్యవేడు : మండలంలోని సత్యవేడు- ఊత్తుకోట మార్గంలోని చెన్నేరి వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇరువురు వాహనదారులు గాయపడ్డారు. చెన్నేరి అరుందతివాడకు చెందిన శ్రీనివాసులు ఊత్తుకోట నుంచి చెన్నేరి గ్రామానికి వస్తుండగా పుదుకుప్పం నుంచి ఊత్తుకోటకు భార్గవ్ ఎదురుగా వస్తుండగా ఇరువురి వాహనాలు పరస్పరం చెన్నేరి వాటర్ ట్యాంకు మలుపు వద్ద ఢీన్నాయి. గాయపడిన వాహనదారులను సమీపంలోని ఊత్తుకోట(తమిళనాడు) ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

ఘనంగా బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి


బాబూ రాజేంద్ర ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న స్కౌట్ విద్యార్థులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని బాబుఅగ్రహార పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రథమ రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ జయంతిని ఏపీజే అబ్దుల్ కలాం స్కౌట్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. జిల్లా స్కౌట్ యువజన విభాగ చైర్మన్ షేక్ అజారుద్దీన్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో రాజేంద్ర ప్రసాద్ పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జ్ఞానప్ప, స్కౌట్ మాస్టర్ యోగానంద, లీడర్ మునిరామ్, సాయి, కిరణ్, స్కౌట్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.